# వెంకట నాయుడీయం




"నాయుడూ సిగరెట్టొకటి నా ముఖాన పారెయ్."

"సిగరెట్టిస్తానందుకోగానీ, నీ ముఖాన విసరను. ఎవరైనా చూస్తే బాగుండదు."

"నీ యిల్లు ఐ. టి (ఇన్‌కంటాక్స్) వాళ్ళు సోదా చెయ్యకపోనూ! సరే, చిన్న కథ చెప్తా విను" - గట్టిగా దమ్ములాగి ఒక క్షణం కళ్ళు మూసుకొని ఉపోద్ఘాతం ప్రారంభించాడు వెంకటి.

"అదొక పట్టణం. ఏ పట్టణం అని ప్రశ్నించుకోవడం అనవసరం.

బాపూ కార్టూనులా నవ్వొచ్చే పట్టణం. ఆరుద్ర కవితలా చమత్కారమైన పట్టణం. ముళ్ళపూడి రచనలా వ్యంగ్యమైన పట్టణం. హిప్పీలాటి పట్టణం. పప్పీలాటి పట్టణం. (పప్పీ మా పక్కింటి కుక్క పేరు) చీకాకుల కీకారణ్యానికి నెలవైన పట్టణం. చిక్కటి చీకట్లకు ఆశ్రయమిచ్చిన పట్టణం. బడా బడా బాబుల పట్టణం. నవాబుల పట్టణం. గరీబుల పట్టణం. మొత్తానికి అందరిదీ ఆ పట్టణం!

ఆ పట్టణం నడిబొడ్డులో ఓ పెద్ద కూడలి. ఆ కూడలి మధ్యస్తంగా

వుందొక మేడ. ఆ మేడ నీడనే ఓ యిల్లు. ఆ యింటిలో ఉన్నదొక చిన్నది. చిన్నదంటే చిన్నదా? పెద్దదే! మేకప్పైన సినీస్టారు లాంటిది. ఆ చిన్నదాని తండ్రి ఓ చిరుద్యోగి. బస్తీలో పనిచేసే చిరుద్యోగి. ఆ చిన్నదాని అన్న ఓ నిరుద్యోగి. బస్తీలో వుండే ఓ నిరుద్యోగి.

నిరుద్యోగి నీరసంగా వుండక కనబడిన ప్రతి ఉద్యోగానికీ దరఖాస్తు తగిలిస్తూ, ఉద్యోగమైనంత సంబరపడుతూ, కలల పల్లకిలో ఊరేగుతుండే అల్పసంతోషి. కార్యశూరుడేగాని కలిసిరానంటోంది కాలం.

"మధ్య తరగతి మందహాసం" చదువుతూ చదువుతూ, చిన్న మందహాసంచేసి నగర సందర్శనానికి ఉపక్రమించాడు. పెద్ద కూడలి జాడన వెళుతూ వెళుతూ, రిలీఫ్‌కై ఓ సిగరెట్టు ముట్టించాడు. రెండు దమ్ములు గట్టిగా లాగాడో లేదో వెనుకనుంచి తనమీద ఎవరిదో చెయ్యి పడింది. ఎవరు నీ వన్నట్టు చూసాడు పొగవదుల్తూ. ఆ ఆసామి నోట బీడీ నాట్యం చేస్తుంది. సినిమాలోని విలన్‌కి అసిస్టెంటులా భయంకరంగా వున్నాడు చింతనిప్పులాటి కళ్ళతో! "అరె భాయ్ అర్జెంట్‌గా ఓ పాంచ్ పడెయ్" ఉత్తర్వు జారీ చేసాడు. "పాంచా? అంటే అయిదా! ఎందుకు? ఇంతకీ నువ్వెవరూ?" నిరుద్యోగి ఇంటర్వ్యూ ఆఫీసరులా అడిగాడు.

"అరె బచ్చా, నన్నెరుగవా? ఈ పేటకి ఓనరులాటోణ్ణి. బడా బాబులకే ఠికానా నై. అలా చూస్తావేం విలన్‌లా? పాంచ్ దే జల్దీ"

"పాంచ్ నై, దస్ నై జా జా."

"బద్మాష్. పాంచ్ నహీఁ" అంటూ జేబులు చెక్ చేశాడు జబర్దస్తీగా. అన్యాయం, అక్రమం అని అరవలేదు నిరుద్యోగి. చెకింగైనాక బిక్కమొహం బెట్టిన విలన్‌గాడి ముఖంచూసి నవ్విన నిరుద్యోగి చెంప చెళ్ మంది. మితభాషి కార్యశూన్యుడు కాదుకదా! ప్రతి చర్యకీ, ప్రతి చర్య తప్పదనే సూత్రానికి నమస్కరించి, రౌడీగాడి చెంప చెళ్లమనిపించాడు. ఇది కథకి నాందీ అనుకో! రౌడీల రాజ్యంలోవున్న - ఆఫ్టరాల్ ఓ 'నాన్ రౌడీ'గాడి ధైర్యానికి కొంచెం విస్మయమందినా, రౌడీగాడు ముష్టి యుద్ధానికి దిగాడు. నిరుద్యోగి 'మూడ్' బాగుందేమో జానపద సినిమాలో హీరోలా ఆ రౌడీగాణ్ణి దంచేశాడు. కథ ప్రస్తుతానికి సుఖాంతమే!

అణచబడిన దీర్ఘరోగం హఠాత్తుగా తిరగేసినట్టు ఓ సినిమా హాలు గేటు దగ్గర ప్రత్యక్షమయాడు మళ్ళీ రౌడీగారు! చితక తన్నిన హీరో అపరంజి బొమ్మ లాంటి చెల్లెల్ని వెంటేసుకుని సినిమా

కొచ్చాడు. రౌడీగారి కళ్ళు ఫ్లోరసెంట్ ట్యూబులా వెలిగాయి. తన ఎర్ర్రరే కళ్ళకు పని కల్పించి, అంబేసిడర్ కాళ్ళకు బుద్ధి చెప్పాడు. మితభాషి ఇదంతా గమనించాడో లేదో మనకిప్పుడే తెలీదు. మనకు తెలిసిందల్లా ఆ బంగారు బొమ్మతో హాలులోకి అడుగుబెట్టాడు. మూడు గంటలు తర్వాత సినిమా వొదిలేక కాలినడకనే వెళుతున్న మితభాషి. బంగారు బొమ్మల దారికి అడ్డంగా వచ్చిన శాల్తీకి తోడుగా మరిద్దరు గుండు గాళ్ళు-క్షమించాలి, గూండా గాండ్రు వున్నారు. విలన్ గారి చేతులు హీరోగారి పీకని గాఢంగా హత్తుకుంటున్నాయి. మితభాషి పెనుగులాడే లోపల బంగారు బొమ్మకి కాళ్లొచ్చాయ్. గాలిలో ఎగిరి ఓ తన్ను తన్నింది. విలన్‌గారు వెల్లికలా పడిపోయారు. ఇదేం పౌరాణిక కథా లేక పోతే జానపదసినిమాయా? ఆడది ఆబలైపోయి, "ఛీ!" అని కేక పెట్టేం దుకు? అసలుసిసలైన సాంఘికం! "జై భోలా శంకర్!"-మళ్లీ ఎగిరిం దామె గాలిలోకి, అలాగే కార్య శూరుడైన మన నిరుద్యోగి కూడా.

చిన్న సైజు స్టంటు సీనయాక గూండాగాండ్రిద్దరు ప్లస్ విలన్‌గా డొకడు వెరశి ముగ్గుర్ని తాళ్ళతో బంధించారు. నిరుద్యోగి అండ్ కో. భీత హరిణేక్షణలా కనులు త్రిప్పిన చిన్నది కాస్త స్థిమిత పడింది.

"థాంక్స్‌రా! రామూ! మనం జయించేం" అని నిరుద్యోగితో ఆమె అంటుండగా 'ఏఁవిటా గడబిడ. లా అండ్ ఆర్డర్ బొత్తిగా లేకుండా.' అన్నట్టు పోలీస్ వాన్ రైఁన వచ్చింది. దుష్టత్రయానికి సాదరంగా ఆహ్వానం దొరికింది. వారి అనుబంధం అలాంటిది మరి! రాజ దర్జాతో-కాదు కాదు మంత్రి దర్జాతో కుడి ఎడమల బాడీగార్డులుండగా వేనెక్కారు, చూడముచ్చటగా ఆ ముగ్గురూ!

ఇప్పుడా మందులకు లొంగని పట్టణంలో, విందులకి పొంగిన పట్టణంలో రౌడీలను జయించిన రౌడీలు....యిద్దరే యిద్దరు....ఒకడు నిరుద్యోగి, యింకొకరు సినిమా మేకప్‌ల చిన్నది.

"ఆఁ నాయుడూ! ఎలాగుంది కథ?" ప్రశ్నించాడు వెంకటి.

"ఇంతకూ నీవు చెప్పొచ్చింది. పట్టణాల్లో నేడు నిరుద్యోగ సమస్య, సీతాకోక చిలుకల సమస్య రౌడీల బెడదను మించిపోయిం దంటావ్? ఈ కథ అచ్చం నీ మొహంలా వుంది." అన్నాడు నాయుడు చిరునవ్వు నవ్వుతూ! నర్మగర్భోక్తులు వెంకటికి నచ్చవు. అందుకే బదులు నవ్వాడు పేలవంగా!